క్లుప్తంగా

ఘనంగా పౌర్ణమి పూజలు



అభిషేకం చేస్తున్న అర్చకుడు

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం శ్రీస్వామివారి మూల విగ్రహానికి అభిషేక పూజలు చేసి విశేషంగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి ఊరేగించారు. భక్తులు అడుగడుగునా కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఆలయ ఆవరణలో ఉదయం నుంచి భజన కార్యక్రమం జరిగింది. పండరీభజన ఆకట్టుకొంది.

సురుటుపల్లెలో అన్నదాన నిర్వహణ భేష్



నాగేశ్వరరావుకు చిత్రపటం అందజేత

నాగలాపురం: మండలంలోని సురుటుపళ్లిలో ప్రసిద్ధ శ్రీసర్వ మంగళ సమేత పళ్లికొండేశ్వర స్వామి ఆలయంలో అన్నదానం, వసతి గృహాల నిర్వహణ చాలా బాగుందని శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం కార్యనిర్వాహణాధికారి ఎస్వీ నాగేశ్వరరావు ప్రశంసించారు. శనివారం ఆయన ఆలయాన్ని సందర్శించారు. దేవస్థానం అధికారులు స్వాగతం ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేశారు. ప్రదోష మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి, తీర్థప్రసాదాలు, స్వామి వారి చిత్రపటం బహూకరించారు. అనంతరం ఈఓ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆలయంలో దర్శన ఏర్పాట్లు, వసతి గృహాలు, అన్నదాన నిర్వహణ చాలా బాగుందని తెలిపారు. పళ్లికొండేశ్వరస్వామి ఆలయ ఈఓ కె.రామచంద్రారెడ్డి, ప్రధాన అర్చకులు కార్తికేశన్, సతీష్ శర్మ, గణేష్ శర్మ, ఆలయ సిబ్బంది పరందామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ఉపాధి సామాజిక తనిఖీ



మాట్లాడుతున్న రాసరాయనాయుడు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో మహాత్మాగాంధీ గ్రామీణ జాతీయ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనుల సామాజిక తనిఖీని పక్కాగా నిర్వహించాలని అంబుడ్స్‌మెన్ రాసరాయనాయుడు తెలిపారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరములో ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ కో ఆర్డినేషన్ సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీరాజ్, ఈజీఎస్, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్, ఫారెస్టు, వెటర్నరీ, స్కూల్ ఎడ్యుకేషన్, వెలుగు, సెర్ప్ శాఖల కింద ఉపాధి నిధులతో పనులను చేపట్టినట్లు తెలిపారు. ఈ పనులను 13మంది డీఆర్‌పీలు తనిఖీ చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు, ఏపీడీ ప్రేమ్‌కుమార్, ఏపీఓ భానుప్రియ, తదితరులు పాల్గొన్నారు.

అమర రాజాకు ‘గ్రేట్ ప్లేస్ టు వర్క్’ అవార్డు



అవార్డు అందుకుంటున్న అమరరాజ సంస్థ ప్రతినిధులు

రేణిగుంట: ఎనర్జీ–మొబిలిటీ రంగంలో 2024 సంవత్సరానికి గానూ తమ కంపెనీకి ప్రతిష్టాత్మకమైన గుర్తింపు లభించినట్లు అమర రాజా కంపెనీ యాజమాన్యం శనివారం వివరించింది. ‘ది గ్రేట్ ప్లేస్ టు వర్క్’ ఇన్‌స్టిట్యూట్ నిర్వహించిన అధ్యయనం ప్రకారం దేశంలో పని చేసేందుకు ప్రసిద్ధి చెందిన ఉత్తమ కంపెనీల జాబితాలో (2024) 68వ ర్యాంక్‌ను అమరరాజ సంస్థ సాధించింది. ముంబైలో శనివారం జరిగిన కార్యక్రమంలో కంపెనీ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్ నరసింహులు నాయుడు, బిజినెస్ హెచ్‌ఆర్ హెడ్ ఎం.రామమూర్తి తదితరులు ఈ అవార్డు, సర్టిఫికెట్‌ను అందుకున్నారు. అవార్డు రావడంపై అమరరాజా హెచ్‌ఆర్ గ్రూప్ చైర్మన్ జైకృష్ణ, సంస్థ డైరెక్టర్ హర్షవర్ధన్ గొరినేని సంతోషం వ్యక్తం చేశారు.

ఏ కష్టమొచ్చినా అండగా ఉంటా



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి



హాజరైన నాయకులు, కార్యకర్తలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా తాను అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి స్పష్టం చేశారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శ్రీకాళహస్తి, తొట్టంబేడు మండలాల నాయకులు, కార్యకర్తలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో తనకు అండగా నిలిచిన నియోజకవర్గ ప్రజలకు, తనను అభిమానించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. వైఎస్సార్ సీపీ ఓటమి చెందినా ఓటు బ్యాంకు సుస్థిరంగా ఉందని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం మనం పోరాడాల్సిన అవసరం ఉందని తెలిపారు. గత ఐదు సంవత్సరాల్లో శ్రీకాళహస్తి నియోజకవర్గ అభివృద్ధిలో తనకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ముఖ్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలకు, తన కోసం పనిచేసిన వారికి, తన మంచి కోరిన వారికి కష్టసుఖాల్లో ఎల్లప్పుడూ అండగా నిలిచిన వారందరికీ పాదాభివందనాలన్నారు. నాయకులు, కార్యకర్తలకు ఎలాంటి కష్టం వచ్చిన తాను అండగా ఉంటానని తెలిపారు. ఎవరైనా ఇబ్బంది పెడితే తోడుగా పార్టీ, తాను ఉంటామని తెలిపారు.

అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలి



ఏర్పేడు: నేను బడికిపోతా ర్యాలీలో విద్యార్థులు



సత్యవేడు: ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

ఏర్పేడు: పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలని సమగ్ర శిక్ష జిల్లా అకడమిక్ మోనిటరింగ్ అధికారి(ఏఎంఓ) శివశంకర్ అన్నారు. శనివారం మండలంలోని చిందేపల్లి ఎస్టీ కాలనీలో ‘నేను బడికిపోతా’ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ, బడిఈడు పిల్లల గుర్తింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్వ ప్రాథమిక విద్యను ముగించుకుని 1వ తరగతిలో చేరుతున్న విద్యార్థుల సామర్థ్యాల అంచనా కోసం ప్రభుత్వం విద్యాప్రవేశ్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు. ఈనెల 13 నుంచి 90 రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని సూచించారు. ప్రతి గ్రామంలో బడిబయట ఉన్న పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలన్నారు. ఎస్టీ గ్రామాల్లో పిల్లలు విద్యకు దూరంగా ఉన్నారని పేర్కొన్నారు. అలాంటి వారిని గుర్తించి బడిలో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ప్రేమలత, ఉపాధ్యాయులు శంకరయ్య, గురవారెడ్డి, దేవరాజులు, సీఆర్‌ఎంటీలు మురళి, గురుప్రసాద్, వెంకటముని పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలి

సత్యవేడు: బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భారతి అన్నారు. పట్టణంలో ఉన్నత పాఠశాల విద్యార్థులు శనివారం పెద్దలందరూ పనికి.. పిల్లలందరూ బడికి అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు శాతం పెంచడం, బడిబయటి పిల్లల్ని బడిలో చేర్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పిల్లలను తల్లిదండ్రులు పనులకు పంపకూడదని పేర్కొన్నారు.

కండలేరులో 6.374 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శనివారం నాటికి 6.374 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 5 క్యూసెక్కులు, పిన్నేరు వాగుకు 20, లోలెవల్ కాలువకు 40 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థులకు జేసీఐ ఉపకార వేతనాలు

తిరుపతి కల్చరల్: జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు మంజూరు చేయనున్నట్లు జేసీఐ అధ్యక్షుడు చైతన్య తేజ్, పూర్వ అధ్యక్షుడు గుణశేఖర్ తెలిపారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో 8, 9, 10వ తరగతి చదువుతున్న పేద విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.2,500 చొప్పున స్కాలర్ షిప్‌లు అందించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 29వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. వివరాలకు 9550976027, 7997991101లను సంప్రదించాలని తెలిపారు. జేసీఐ కార్యదర్శి శేషసాయి, ఉపాధ్యక్షులు దొరస్వామిరాజు, రత్నశేఖర్, నామా రాజేష్ పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

పెళ్లకూరు: మండల కేంద్రమైన పెళ్లకూరు వద్ద శనివారం సాయంత్రం కారు ఢీకొనడంతో వ్యక్తి గాయపడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు.. దిగువ చావలి గ్రామానికి చెందిన కామిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి పెళ్లకూరు రెవెన్యూ కార్యాలయంలో పనులు ముగించుకుని బైక్‌లో ఇంటికి వెళుతున్నాడు. ఈ క్రమంలో హైవే రోడ్డు పైకి వెళ్లే సమయంలో నెల్లూరు నుంచి తిరుపతి విమానాశ్రయానికి వెళుతున్న కారు ఢీకొంది. ఈ ఘటనలో గోవర్ధన్‌రెడ్డి గాయపడ్డాడు. అతన్ని స్థానికులు నాయుడుపేట ఆస్పత్రికి తరలించారు.

ఘనంగా ఒలింపిక్ డే ప్రదర్శన

తిరుపతి కల్చరల్: ఒలింపిక్ డే సందర్భంగా తిరుపతిలో క్రీడాకారులతో శనివారం వేడుకగా ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్, ఉప విద్యాశాఖాధికారి బాలాజీ, డీఎస్‌ఓ సయ్యద్ సాహెబ్, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎలమంచిలి ప్రవీణ్ పాల్గొన్నారు. జెండా ఊపి ఒలింపిక్ డే ప్రదర్శనను ప్రారంభించారు. స్పోర్ట్స్ కాంప్లెక్స్ నుంచి క్రీడా జ్యోతితో వందలాదిమంది క్రీడాకారులు, క్రీడాభిమానులు, క్రీడా సంఘాల నేతలు ర్యాలీ చేపట్టారు. ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీధర్, హెచ్.సాయికుమార్, ఎంవీఎస్.మణి, శివప్రసాద్, ప్రసన్నకుమార్‌రెడ్డి, ఏ.ఈశ్వర్ ప్రకాష్, పీఈటీలు విజయకుమారి, సుధారాణి, జెన్ స్పోర్ట్స్ కిరణ్‌కుమార్, రెడ్డెప్ప, కైలాష్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి ఆవరణలో లోపించిన పారిశుధ్యం





ప్రభుత్వాస్పత్రి ఆవరణలో వ్యర్థాలు, మురుగునీరు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రిలో అధికారుల నిర్లక్ష్యంతో పారిశుధ్యం లోపించింది. ఆస్పత్రి ఆవరణలోని డయాలసిస్ కేంద్రం వద్ద ఎక్కడ చూసినా చెత్తా చెదారం పేరుకుపోయి ఉంది. దీంతో రోగులు, వారి బంధువులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురుగునీరు కూడా నిల్వ చేరడంతో దోమల బెడద ఎక్కువగా ఉంటోంది. దీంతో రోగుల బాధలు వర్ణనాతీతం. పలుమార్లు అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని రోగులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆస్పత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

శ్రీకాళహస్తి-నడికుడిని పూర్తి చేయాలి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి- నడికుడి రైల్వే లైన్ ప్రాజెక్టును త్వరగా పూర్తిచేయాలని తిరుపతి మాజీ ఎంపీ చింతామోహన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం పట్టణంలో ర్యాలీ నిర్వహించా రు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాను తిరుపతి ఎంపీగా ఉన్న సమయంలో శ్రీకాళహస్తి-నడికుడి రైల్వే లైన్ ప్రాజెక్టును తీసుకొచ్చామని, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం పదేళ్లుగా పట్టించుకోలేదని ఎద్దేవా చేశారు. ఇప్ప టికైనా పనులు త్వరగా పూర్తిచేయాలని కోరారు. నాయకులు కూలి రవి, రావణ, నరేంద్రనాయుడు, పసల శాంతయ్య, ధర్మయ్య, తిరుపాల్ పాల్గొన్నారు.

ఆఖరి స్నేహితుడు పుస్తకావిష్కరణ



ఆఖరి స్నేహితుడు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీ వేత్తలు

తిరుపతి కల్చరల్: జీవితంలోని కఠిన వాస్తవాల ఆవిష్కరణే ఆఖరి స్నేహితుడు కథల పుస్తకమని సంస్కృత విద్యాపీఠం పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య ఏ. గురుమూర్తి తెలిపారు. తిరుపతి జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో రచయిత తిరువాయపాటి రాజగోపాల్ రచించిన ఆఖరి స్నేహితుడు కథల పుస్తకావిష్కరణ సభ శనివారం సాయంత్రం ఆఫీసర్స్ క్లబ్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ఆఖరి స్నేహితుడు కథల పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఎస్వీయూ ఓరియంటల్ స్టడీస్ సంచాలకుడు వీసీ వెంకటేశ్వర్లు పుస్తక సమీక్ష చేశారు. జిల్లా రచయితల సంఘం కార్యదర్శి మన్నవ గంగాధర ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ కథా రచయిత మధురాంతకం నరేంద్ర, ఫైన్ ఆర్ట్స్ అకాడమీ పూర్వ కార్యదర్శి ఆచార్య పి.దేవసేననాయుడు, సాహితీ వేత్త సాకం నాగరాజు, కాంతారావు, కొత్వాయి అమరేంద్ర, డాక్టర్ తమటం రామచంద్రారెడ్డి, డాక్టర్ నాదెండ్ల శ్రీమన్నారాయణ, డాక్టర్ పాక్కళ్ల సుభద్ర, టెంకాలయ దామోదరం, విజయరాంప్రసాద్, రమణ, సోము ఉమాపతి, సుందరం, జయపాల్ పాల్గొన్నారు.

ఫుడ్ టెక్నాలజీ కెరీర్‌పై అవగాహన



మాట్లాడుతున్న కోకాకోలా బేవరేజస్ ప్రాజెక్ట్ మేనేజర్ చెంగముని

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీ హోమ్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో ఫుడ్ టెక్నాలజీ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాల అన్వేషణలో సలహాలు, కావాల్సిన నైపుణ్యాభివృద్ధిపై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బెంగళూరుకు చెందిన హిందూస్థాన్ కోకా కోలా బేవరేజస్‌కు క్యూఎస్‌ఈ ప్రాజెక్ట్ మేనేజర్ జె.చెంగముని హాజరయ్యారు. విద్యార్థులకు కెరీర్‌పై పలు సలహాలు, సూచనలు చేశారు. ఆహార భద్రత, నిర్వహణ, నాణ్యత ఫుడ్ టెక్నాలజీలో ప్రధాన అంశాలని తెలియజేశారు. ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నియమాలు, నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. హోమ్ సైన్స్ హెడ్ డాక్టర్ వి.బిందు, ప్రొఫెసర్లు సచివంగ, డాక్టర్ అరుణ, శిరీషా, మాధవి, ఎం నిహారిక, విద్యార్థినులు పాల్గొన్నారు.

కనులపండువగా ఊంజల్ సేవ



ఉభయ నాంచారులతో ఉయ్యాల సేవలో కల్యాణ వెంకన్న

నారాయణవనం: టీటీడీ అనుబంధ శ్రీపద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం దేవదేవేరులకు ఊయ్యాల సేవ నేత్రపర్వంగా జరిగింది. సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరచిన అర్చకులు నిత్యపూజా కార్యక్రమాలను నిర్వహించారు. శనివారం కావడంతో ఉదయం నుంచి భక్తుల రద్దీ కన్పించింది. మధ్యాహ్నం దాతల సహకారంతో భక్తులకు అన్నప్రసాదాలను అందజేశారు. సాయంత్రం కైంకర్యాల అనంతరం శ్రీదేవి,భూదేవి సమేత స్వామివారి ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి తిరుచ్చిపై అధిష్టింపజేశారు. తదుపరి ఊంజల్ మండపానికి వేంచేపు చేసి ఊయలలో కొలువుదీర్చారు. వేదనాద కచేరీల నడుమ సాగిన ఊయ్యాల సేవలో సేదతీరుతున్న ఉత్సవమూర్తులను దర్శించి భక్తులు తన్మయత్వం చెందారు. ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్, షరాబు షనాయ్ పర్యవేక్షించారు. ఆలయ అధికారి మాట్లాడుతూ ప్రతి శనివారం మధ్యాహ్నం ఆలయంలో దాతల సహకారంతో భక్తులకు అన్నప్రసాదాల వితరణ చేపడుతున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న దాతలు ఆలయ కార్యాలయంలో సంప్రదించవచ్చని కోరారు.

సమస్యలపై తక్షణమే స్పందించాలి



సమావేశంలో ట్రాన్స్‌కో ఏఈని నిలదీస్తున్న సభ్యులు

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రజా ప్రతినిధులు తీసుకొచ్చే సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించాలని ఎంపీపీ ఎం.సుబ్బలక్ష్మి తెలిపారు. శనివారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మధ్యాహ్న భోజనాన్ని అధికారులు తనిఖీ చేయాలని సూచించారు. సభ్యులు గ్రామాల్లోని సమస్యలను ఏకరువు పెట్టారు. సచివాలయ సిబ్బంది పనితీరు బాగోలేదని, సమయపాలన పట్టించుకోవడం లేదని, అధికారుల పర్యవేక్షణ అవసరం ఉందన్నారు. ట్రాన్స్‌కో ఏఈ పుణ్యకోటి పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యలపై ఇబ్బందులు పడుతున్నామని విన్నవిస్తున్నా ఏఈ పట్టించుకోవడం లేదని నిలదీశారు. ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు మాట్లాడుతూ విద్య, ఆరోగ్యం, విద్యుత్, వ్యవసాయం, తాగునీటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. సర్పంచ్‌లు తాగునీటి ట్యాంకులను తప్పనిసరిగా క్లోరినేషన్ చేయించాలని తెలిపారు. మండల వ్యవసాయశాఖాధికారి భారతి మాట్లాడుతూ ఆర్‌బీకేల్లో ఎరువులను అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. హౌసింగ్ ఏఈ సుబ్రమణ్యం మాట్లాడుతూ మండలంలో 943 జగనన్న ఇళ్లకు గానూ 609 పూర్తి య్యాయని, మిగిలినవి త్వరతిగతిన పూర్తి చేస్తామని తెలిపారు. ఎంపీటీసీ సభ్యుడు రవి మాట్లాడుతూ కాటూరు దళితవాడలో శ్మశానం లేక పోవడంతో చెరువు కట్టపై శవాలను పూడ్చుతున్నామని, స్థలం కేటాయించాలని పలు సమావేశాల్లో విన్నవించినా ఫలితం కనిపించడం లేదని తెలిపారు. చీఫ్ హెల్త్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, ఎంఈఓ రవీంద్రనాథ్ పాల్గొన్నారు. పోలీసుశాఖ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, పశుసంవర్ధకశాఖ, సాంఘిక సంక్షేమం శాఖ, ఎక్సైజ్‌శాఖ, ఆర్‌అండ్‌బీ శాఖల అధికారులు హాజరుకాలేదు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



పిల్లలకు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలుకుతున్న భారతి

ఏర్పేడు: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందించే పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సూపర్‌వైజర్ భారతి అన్నారు. శనివారం మండలంలోని ముసలిపేడులో అంగన్‌వాడీ బాట కార్యక్రమం, ర్యాలీ జరిగింది. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో మూడు సంవత్సరాల వయస్సున్న పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలన్నారు. కేంద్రాల్లో బొమ్మలతో కూడిన విద్యను అందిస్తున్నట్లు వివరించారు. పిల్లలకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి కేంద్రంలోకి ఆహ్వానించి, పేర్లు నమోదు చేసుకున్నారు.

స్టూడెంట్స్ కిట్స్ పంపిణీ

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం స్టూడెంట్స్ కిట్స్‌ను హెచ్‌ఎం రమణయ్య పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు యూనిఫాం, షూ, బెల్టు, బ్యాగు, డిక్షనరీ, పుస్తకాలు ఇస్తున్నట్లు తెలిపారు.ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు



కళాశాల మైదానాన్ని శుభ్రం చేయిస్తున్న డీఎస్పీ తదితరులు

శ్రీకాళహస్తి: బహిరంగ ప్రదేశాల్లో తాగుబోతులు మద్యం సేవించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు శ్రీకాళహస్తి డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలోని క్రీడా మైదానాన్ని మున్సిపల్ సిబ్బందితో కలిసి టూటౌన్ సీఐ రారాజు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి మాట్లాడుతూ బహిరంగంగా మద్యపానం సేవించడం కారణంగా అనేక గొడవలు జరుగుతాయని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించేవారు ఎంతటి వారైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని, కేసులు నమోదు చేసి జైలుకు తరలిస్తామని హెచ్చరించారు.శ్రీకాళహస్తిలో 17 బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్నట్లు గుర్తించామని, అక్కడ ఉన్న మద్యం సీసాలు, చెత్తాచెదారాన్ని శుభ్రం చేయిస్తూ పరిశుభ్రంగా ఉంచుతున్నామని పేర్కొన్నారు. వాకర్స్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ కళాశాల మైదానంలో రాత్రి సమయంలో కొంతమంది ఆకతాయిలు మద్యం సేవిస్తూ అపరిశుభ్రం చేస్తున్నారన్నారు. పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడం సంతోషకరమన్నారు. తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. డీఎస్పీ, మున్సిపల్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఏడుకొండలు, రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తి సంకీర్తనల పరిమళం



అన్నమయ్య సంకీర్తనలను గానం చేస్తున్న కళా బృందం



నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

తిరుపతి కల్చరల్: మనోవికాస్, అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుల సంయుక్త ఆధ్వర్యంలో యశోద నగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రం ఆడిటోరియంలో నిర్వహిస్తున్న సప్తగిరి సంగీత సప్తాహం శనివారంతో ఏడో రోజుకు చేరుకుంది. అన్నమాచార్య పద కవితా గుబాళింపు పేరుతో చేపట్టిన ఈ కార్యక్రమంలో ఉదయం నుంచి రాత్రి వరకు వివిధ ప్రాంతాలకు చెందిన ప్రముఖ సంగీత విద్వాంసులు, కళాకారులు అన్నమయ్య సంకీర్తనలను సుమధురంగా గానం చేశారు. కళాకారులు ఎం.మోహన్, పుంగనూరుకు చెందిన నారాయణస్వామి, ఆనందరెడ్డి, శంకరయ్య, నెల్లూరుకు చెందిన శివశంకర్, శ్రీకాళహస్తికి చెందిన టి.తేజోవతి తదితర 22 మంది కళాకారులు అన్నమయ్య పద సంకీర్తనలను తమదైన శైలిలో ఆలపించారు. కొందరు నృత్య కళాకారులు అన్నమయ్య సంకీర్తనలకు లయబద్ధంగా నృత్యాభినయం చేసి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. అనంతరం కళాకారులను శాలువాలు, జ్ఞాపికలతో నిర్వాహకుడు పున్నమరాజు మురళీకృష్ణ ఘనంగా సత్కరించారు.